ఈనాడు
జోగులాంబ గద్వాల
బుధవారం అక్టోబరు 23, 2024 5

ఆక్రమణలో ఆలయ మార్గం

ఇబ్బందులు పడుతున్న భక్తులు



ఆలయాలకు వెళ్లే మార్గంలో రోడ్డుపైకి నిర్మాణాలు, ఆక్రమణలు

అలంపూర్, న్యూస్‌టుడే: జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి దర్శనానికి నిత్యం వేల మంది భక్తులు అలంపూర్ ఆలయాలకు వస్తుంటారు. ఇక ఉత్సవాలు, సెలవు రోజుల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. కాగా ఆలయాలకు వచ్చే మార్గం ఆక్రమణలకు గురై ఇరుకుగా మారింది. దీంతో భక్తులు అవస్థలు పడుతున్నారు.

ఆక్రమణలతో..: ఠాణా నుంచి ఆలయాల వరకు రోడ్డు మరీ ఇరుకుగా ఉంటోంది. గతంలో ఈ రోడ్డును కొంత మేరకు వెడల్పు చేశారు. అయితే ఆలయాలకు వచ్చు మార్గ మధ్యంలో రోడ్డు ప్రదేశాన్ని కొందరు కబ్జా చేసి దుకాణాలు నిర్మించేసుకున్నారు. కొంత మంది ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటిని ఈ రోడ్డుపైకి వదులుతున్నారు. నిత్యం ఆలయాలకు సివిల్ సర్వెంట్లు, న్యాయమూర్తులు, పోలీస్ ఇతర శాఖల ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నటులు, విదేశీయులు వస్తుంటారు. ఆలయాలకు రద్దీ పెరుగుతున్నా రోడ్డు మాత్రం వెడల్పు చేయడం లేదు. పైగా కొంత మంది తమ ఇళ్ల ముందు ఆక్రమించుకుని ఏకంగా దుకాణాలు నిర్మించేసుకున్నారు. ఇంత జరుగుతున్నా పురపాలిక శాఖ అధికారులు అసలు పట్టించుకోవడం లేదని విమర్శలు గుప్పుమంటున్నాయి. అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై స్థానికులు అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో మురుగు నీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తుంటుంది. భక్తులు మురుగు తొక్కుకుంటూ ఆలయాలకు వెళ్లాల్సిన దుర్భర పరిస్థితి ఇక్కడ ఉంది.

ఉత్సవాల సమయంలో మరింతగా..: మహా శివరాత్రి, దేవీ నవరాత్రులు, జోగులాంబ ఉత్సవ సమయంతో పాటు కార్తిక మాసం, ఉర్సు ఉత్సవాలకు భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఆ సమయంలో రోడ్డు సరిపడక భక్తులు ఒకరినొకరు తోసుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఉంటుంది. రోడ్డు ఇరుకు కావడంతో వాహనాల రాకపోకలకు, భక్తులు వెళ్లేందుకు ఇబ్బంది ఉంటోంది. ఈ మార్గంలో మరి కొంత మంది ఏకంగా రోడ్డు పైనే తోపుడు బండ్లు పెట్టడంతో వాహన చోదకులు ఇక్కట్లు పడుతున్నారు. పేరుకు మాత్రమే శక్తిపీఠం కానీ భక్తులకు మెరుగైన వసతులు ఇక్కడ లేవు. దీంతో వారికి నిత్యం ఇక్కడ అవస్థలు తప్పడంలేదు. పురపాలిక ఏర్పడిన తరువాత పూర్తి స్థాయిలో అభివృద్ధి జరుగుతుందని పట్టణ ప్రజలు, ఆలయాలకు వచ్చే భక్తులు ఆశించారు. కానీ అలాంటి చర్యలేవీ కనిపించడంలేదు. ప్రధానంగా గాంధీ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయ ఆవరణ మీదుగా నేరుగా ఆలయాలకు రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు, భక్తులు కోరుతున్నారు. ఆలయాలకు వెళ్ల మార్గం వెడల్పు లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారంటున్నారు.

చర్యలు తీసుకుంటాం:
ఆక్రమణలపై గతంలోనే నోటీసులు జారీచేశాం. కొంత మేరకు కబ్జా అయిన మాట వాస్తవమే, 1984 సంవత్సరంలోనే అక్కడి ఇళ్లకు అవార్డు సైతం ఇచ్చారు, అన్ని శాఖల సమన్వయంతో మార్గం వెడల్పు చేసేందుకు కృషి చేస్తాం. ఉత్సవాల జరిగే సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే, ఈ విషయంపై ఠాణాలో ఫిర్యాదు కూడా చేశాం.
-మనోరమ, పుర చైర్‌పర్సన్, అలంపూర్



కుమురం భీం చిత్రపటానికి నివాళులు

కుమురం భీం నేటి యువతకు ఆదర్శం

అయిజ, న్యూస్‌టుడే: నిరంకుశత్వాన్ని ఎదురించిన వీరుడు కుమురం భీంను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని భాజపా పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి పేర్కొన్నారు. జయంతి సందర్భంగా పట్టణంలో కొమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అడవి బిడ్డల హక్కుల కోసం పోరాటం చేసి వీరత్వం పొందిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.



నగదు తీసుకో.. వేలిముద్ర వేసిపో!



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో ఇదే దందా

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ గ్రామీణం



ఖిల్లాగణపురంలో పట్టుకున్న బియ్యం మహబూబ్‌నగర్ పట్టణం రవీంద్రనగర్‌లోని ఈ రేషన్ దుకాణానివే



దుకాణాన్ని సీజ్ చేయకుండా తాళం వేసిన అధికారులు

ఇప్పుడు రేషన్ దుకాణాల్లో ఉచితంగానే బియ్యం పంపిణీ చేస్తున్నారు. బియ్యం తప్ప ఏ ఇతర సరకులు పంపిణీ చేయటం లేదు. ఈ లెక్కన రేషన్ డీలర్ దగ్గర డబ్బులే ఉండొద్దు. కానీ ఏ రేషన్ దుకాణానికి వెళ్లినా డీలర్ ముందట డబ్బులు పట్టుకుని సిద్ధంగా ఉంటున్నారు. రేషన్ దుకాణాలకు వచ్చే లబ్ధిదారులను ఏమాత్రం సంకోచం లేకుండా బియ్యం ఇస్తారా అని నేరుగా అడుగుతున్నారు. వేలిముద్ర వేయించుకుని వారికి బియ్యం కాకుండా డబ్బులు ఇచ్చి పంపిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యం రేషన్ దుకాణం నుంచి నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ఇదంతా తెలిసినా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఒక్కరినీ పట్టుకున్న దాఖలా లేదంటే ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

పట్టుకుంటున్నది పోలీసులే : ఉమ్మడి జిల్లాలో 2,024 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 89,95,931 రేషన్ కార్డుల్లోని లబ్ధిదారులకు ప్రతినెలా 1,59,386 క్వింటాళ్ల బియ్యం కేటాయిస్తున్నారు. సగం కుటుంబాలు కూడా ఇంటికి బియ్యం తీసుకోవటం లేదు. భారీ మొత్తంలో బియ్యం రేషన్ దుకాణాల నుంచి అక్రమంగా రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఈ నెల 14న ఖిల్లాగణపురం మండల శివారులోని ఓ రైస్‌మిల్లు వద్ద వాహనంలో ఇద్దరు వ్యక్తులు 19 క్వింటాళ్ల ఉచిత బియ్యం తరలిస్తూ సీసీఎస్ పోలీసులకు చిక్కారు. వారిని ఆరా తీస్తే మహబూబ్‌నగర్‌లోని రేషన్ దుకాణం నుంచి బియ్యం తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ సమాచారంతో అధికారులు మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్న పేట, రవీంద్రనగర్, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బోర్డు కూడా లేకుండా రవీంద్రనగర్‌లోని చిన్న సందులో నిర్వహిస్తున్న 5వ నంబరు రేషన్ దుకాణం నుంచి బియ్యం తరలించినట్లు గుర్తించి ఆ డీలర్‌పై కేసు నమోదు చేశారు. 17న మానవపాడు మండలం నుంచి 23 క్వింటాళ్ల బియ్యం ఆటోలో పెబ్బేరులోని రైస్‌మిల్లుకు తరలిస్తుండగా సీసీఎఫ్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇలా రోజూ ఎక్కడో ఒకచోట బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటే పోలీసులు పట్టుకుంటున్నారే తప్పా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పట్టించుకోవటం లేదు. అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు తెలియజేస్తే పట్టుకోవడం సంగతి అటుంచి వారు డీలర్లకే సమాచారం ఇచ్చి అప్రమత్తం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అపనమ్మకంతోనే జనం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలకు కాకుండా సీసీఎఫ్ పోలీసులకే సమాచారం ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు బియ్యం పట్టుకుని నమోదు చేసిన కేసులే ఎక్కువగా ఉండటం గమనార్హం.



దుకాణాలపై నిఘా ఏదీ? : రేషన్ దుకాణాల నుంచి ఉచిత బియ్యం తీసుకెళ్లే వినియోగదారుల ఇళ్ల వద్దకు డీలర్ల ప్రతినిధులు వెళ్లి కిలో రూ.10 నుంచి రూ.15 చొప్పున ధర చెల్లించి బియ్యం సేకరించేవారు. ఆ బియ్యం ఆటోల్లో రైసుమిల్లులకు చేరవేసేవారు. ఇప్పుడు పంథా పూర్తిగా మార్చేశారు. లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించుకుని రేషన్ దుకాణంలోనే బియ్యం కొనేస్తున్నారు. ఆ బియ్యం ఏరోజుకారోజు రాత్రి రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో 84 రేషన్ దుకాణాలు ఉండగా ప్రతినెలా 11,370 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతాయి. లబ్ధిదారుల వేలిముద్రలు వేయించుకుని డీలర్లు దాదాపు సగం బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. అన్ని మండలాల్లోనూ ఇదే జరుగుతోంది. ప్రతి నెలా 28వ తేదీ నుంచే బియ్యం కోటా గోదాం నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా అవుతుంది. 1వ తేదీ నుంచి పంపిణీ చేస్తారు. దుకాణానికి బియ్యం చేరిన రోజు నుంచే నిఘా పెట్టాల్సి ఉన్నా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పట్టించుకోవట్లేదు.

నిర్వహణ లేక నీరందక!

తరచుగా తెగుతున్న కేఎల్ఐ బ్రాంచి కాల్వ



ముత్తిరెడ్డిపల్లి వద్ద పాటు కాల్వపై ఉన్న యూటీ ఎక్కి కేఎల్ఐ కాల్వలోకి పారుతున్న వర్షపు నీరు

కోడేరు, కొల్లాపూర్, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. పసుపుల - పాన్‌గల్ బ్రాంచి కాల్వపై నుంచి పాటు కాల్వలు ఉన్నాయి. వర్షపు నీరు పోవడానికి పాటుకాల్వలపై యూటీలు నిర్మాణం చేశారు. భారీ వర్షాలు వస్తే యూటీ ఎక్కిపారి కేఎల్ఐ కాల్వలోకి నీరు ప్రవహిస్తోంది. కాల్వకు సిమెంట్ లైనింగ్ పనులు చేయక, కాల్వ గట్టు తక్కువగా ఉండటం, పాటుకాల్వపై ఉన్న యూటీల నుంచి వర్షపు నీరు ఎక్కి పారుతుండటంతో తరచుగా తెగిపోతున్నాయి.

సామర్థ్యం 30 వేలు.. సాగు 60 వేలు : ఏటా రెండు పంటలకు సాగునీరు ఇచ్చే కేఎల్ఐ బ్రాంచి కాల్వకు వర్షపు నీటిగండం పట్టుకుంది. కేఎల్ఐలోని పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వ, ఉప కాల్వల పరిధిలో 30 వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. జొన్నలబొగుడ జలాశయం, గుడిపల్లి జలాశయానికి ఉన్న ప్రధాన కాల్వకు మూడో కిలోమీటర్ వద్ద పసుపుల - పాన్‌గల్ బ్రాంచి కాల్వ ఏర్పాటైంది. ఈ కాల్వ నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలోని కోడేరు, పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లోని కొన్ని గ్రామాల పంటలకు సాగునీరు అందిస్తుంది. మొత్తం 33 కిలోమీటర్ల పొడవున ఉండగా కోడేరు మండలంలో 12 వేల ఎకరాలు, పాన్‌గల్ మండలంలో 13 వేలు, వీపనగండ్లలో సుమారు 2 వేల నుంచి 5 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. అయిదేళ్లుగా మూడు మండలాల్లో మొక్కసారిగా ఆయకట్టు 50 వేల నుంచి 60 వేల ఎకరాలకు సాగు పెరిగింది. ఉప కాల్వల చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లైనింగ్ లేకపోవడంతోనే..: పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వకు మొదటి నుంచి సిమెంట్ లైనింగ్ పనులు చేయలేదు. 33 కిలోమీటర్ల పొడవునా గత ప్రభుత్వ హయాంలో 2023లో సిమెంట్ లైనింగ్ పనులకు రూ. 60 కోట్లతో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు పనులకు టెండర్లు పిలవలేదు. సెప్టెంబరులో దాదాపుగా 20 రోజులు కురిసిన భారీ వర్షాలకు ముత్తిరెడ్డిపల్లి, రాజాపూర్ శివారుల్లో బ్రాంచి కాల్వ తెగిపోయే పరిస్థితి నెలకొనడంతో అధికారులే కాల్వకు గండి పెట్టి వాగులకు వరద నీటిని వదిలారు. తెగకుండా చర్యలు చేపట్టారు. కోడేరు, పెద్దకొత్తపల్లి, పాన్‌గల్ మండలాల్లో ఉన్న ఉప కాల్వలు ఎక్కడపడితే అక్కడ తెగిపోయాయి. మరి కొన్ని కాల్వల్లో జమ్ముగడ్డి, కంపచెట్లు పెరిగాయి.

నిధులు కేటాయిస్తేనే..
పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వ మరమ్మతులకు నిధులు లేవు. జమ్ము గడ్డి, పూడిక తీత, కాల్వ గట్టు పెంచడం, కోతలు పడితే మరమ్మతులు, కంపచెట్లు తొలగింపునకు బ్రాంచి, పిల్ల కాల్వల సర్వే చేశాం. రూ. 40 లక్షలతో అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తాం.
- రవీందర్, ఈఈ, కేఎల్ఐ, నాగర్‌కర్నూల్



ఉషోదయం.. వర్ణ శోభితం!

కొన్ని రోజులుగా ఆకాశం సూర్యోదయాన, సంధ్యా సమయాన ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునేలా వర్ణ శోభితంగా మారుతోంది. మంగళవారం ఉషోదయాన రాజోలి శివారులోని సుంకేసుల డ్యాం వద్ద కనిపించిన ఈ దృశ్యం సాక్షిగా.. దృశ్యాన్ని పలువురు ఆస్వాదించారు.
-న్యూస్‌టుడే, రాజోలి

తుంగభద్రకు భారీగా వరద ప్రవాహం



సుంకేసుల నుంచి విడుదలవుతున్న నీరు

శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో ప్రవాహం భారీగా పెరుగుతోంది. మంగళవారం జలాశయం నుంచి 1,14,500 క్యూసెక్కుల నీటిని ఆర్డీఎస్ ఆనకట్టకు విడుదల చేశారు. ప్రస్తుతం ఆనకట్ట వద్ద 11.2 అడుగుల ఎత్తులో 53,250 క్యూసెక్కుల ప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.2 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, అది రాష్ట్రానికి వచ్చేసరికి 5 అడుగులుగా ఉంది. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. ఆర్డీఎస్‌ప్రధానకాల్వలో ఎగువ నుంచి నీటిప్రవాహం ఎక్కువ ఉండటంతో పథకం నుంచి నీటిని నిలిపివేసినట్లు ఏఈ తెలిపారు.

సుంకేసుల: జలాశయానికి ఎగువ నుంచి 44,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో పది గేట్ల ద్వారా 42,400 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తుండగా, కేసీ కాలువకు రెండు వేల క్యూసెక్కుల విడుదల చేస్తున్నట్లుగా డ్యాం అధికారులు పేర్కొన్నారు.

జూరాల గేట్లు మూసి వేత

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గటంతో దిగువకు గేట్ల ద్వారా నీటి విడుదల నిలిపివేసి జలవిద్యుదుత్పత్తి ద్వారా మాత్రమే వదులుతున్నారు. జలాశయంలోకి 64 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు జల విద్యుదుత్పత్తి ద్వారా 37వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణ్‌పూర్ జలాశయాలకు సైతం వరద తగ్గుముఖం పట్టింది. ఆలమట్టిలోకి 38వేల క్యూసెక్కుల వరద చేరుతుండగా 37వేలు దిగువకు వదులుతున్నారు. నారాయణ్‌పూర్‌లోకి 31వేల క్యూసెక్కులు చేరుతుండగా 26 వేలు వదులుతున్నారు.

సమాజంపై అవగాహన అవసరం: ఎస్పీ

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులు విద్యతో పాటు సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం గద్వాలలోని జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్‌హౌస్‌ను ఆయా పాఠశాలల విద్యార్థులు సందర్శించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

ఓపెన్ హౌస్‌లో ఏర్పాటు చేసిన షీటీం, సైబర్ క్రైం, మాదక ద్రవ్యాల నివారణ, భరోసా, ఆయుధ ప్రదర్శన, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజుబుల్, ట్రాఫిక్ స్టాల్స్‌పై పోలీసు అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్పీ శ్రీనివాసరావు విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. పోలీసు, ప్రభుత్వం అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో సైబర్ క్రైం, మహిళలపై ఈవ్ టీజింగ్ వ్యవహారం చోటు చేసుకునేవి కాదని చెప్పారు. కాలానుగుణంగా మారిన నేర ప్రవృత్తిపై ప్రజలు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని వివరించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు తప్పకుండా పోలీసు దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మహాసభలు జయప్రదం చేయండి

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సీపీఎం) జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఈ నెల 25, 26వ తేదీలలో గద్వాలలోని అనంత కన్వెన్షన్ హాల్లో మహాసభలు జరగనున్నాయని తెలిపారు. సభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవీ రమణలు హాజరు కానున్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు ఉప్పేర్ నరసింహ, సవారి, ఈశ్వర్, వీరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ సారీ.. భరోసా లేదు మరి!



కొత్తకోట, గద్వాల, న్యూస్‌టుడే: రైతులకు ఒకే విడతలో రూ.2 లక్షలు రుణమాఫీ చేసిన ప్రభుత్వం వానాకాలం పంటలకు రైతుభరోసా ఇచ్చి తీరుతుందని గట్టి నమ్మకం ఉండేది. ఆ నమ్మకంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీళ్లు చల్లేశారు. జులైలో రైతుల సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాల్ని తీసుకున్నప్పటికీ 'రైతు భరోసా' ఎవరికి ఇవ్వాలన్న దానిపై ప్రభుత్వానికి స్పష్టత రాకపోవడంతో వానాకాలం పంటలకు రైతుభరోసా ఇవ్వడం లేదంటూ మంత్రి స్పష్టం చేయడంతో రైతులకు నిరాశే మిగిలింది.

ఆరేళ్లుగా సాయం..: రైతులకు పెట్టుబడి సాయం అందించి వారిలో ఉత్సాహం నింపి సాగును క్రమంగా పెంచవచ్చని, పెట్టుబడి కోసం అప్పులు చేయరాదని భారాస హయాంలో రైతుబంధు పథకాన్ని ప్రకటించింది. 2018 మేలో తొలిసారి పెట్టుబడి సాయాన్ని విడుదల చేశారు. తొలి ఏడాది వానాకాలం, యాసంగి పంటలకు కలిపి రెండు విడతల్లో రూ.4 వేల చొప్పున ఎకరాకు రూ.8 వేలు అందజేయగా తర్వాత ఏడాది నుంచి ఏటా రెండు విడతల్లో మొత్తం రూ.10 వేలు అందజేస్తూ వచ్చారు. ఇలా క్రమం తప్పకుండా ఆరేళ్లు పథకాన్ని అమలు చేశారు. గత డిసెంబర్‌లో అందాల్సిన యాసంగి రైతుబంధు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోగా వాటిని ఈ ఏడాది జులైలో విడుదల చేశారు. ఇదే పథకాన్ని 'రైతు భరోసా' పేరుతో ఏడాదికి రెండు విడతల్లో రూ. 7,500 చొప్పున రూ. 15 వేలు అందజేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నిధుల్ని దుర్వినియోగం చేస్తూ వ్యవసాయదారులకే కాకుండా స్థిరాస్తి వ్యాపారులకు, గుట్టలకు పుట్టలకు వీటిని అందజేసిందని, నిజమైన రైతుల కంటే బడాబాబులే ఎక్కువ లబ్ధి పొందారని వారిని ఏరి పారేసి రైతులకు భరోసా అందజేస్తామంది. ఈ క్రమంలో జూన్‌లోనే పలు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ చేపట్టారు. అయినా మంత్రి వర్గ ఉపసంఘంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో రైతు భరోసాకు వానాకాలం నిధులకు బ్రేక్ పడింది. యాసంగి నుంచి అమలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది.



● రైతుభరోసా అందుతుందని ఎంతో ఆశ పడ్డాం. పెట్టుబడి సాయం అందుతుందని ప్రైవేటులో వడ్డీలకు తెచ్చుకున్నాం. ఇప్పుడు సాయం దక్కకపోవడంతో పంటలపై వాటిని కట్టే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం వెంటనే యాసంగి పంటల భరోసానైనా విడుదల చేసి రైతులకు అండగా నిలవాలి.
- జలంధర్‌రెడ్డి, కొత్తకోట

తెరచుకోని పోర్టల్ : మరోవైపు రైతుభరోసా నమోదు చేసుకునే అవకాశం కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు దక్కించుకున్న రైతులు జూన్ నాటికి రాష్ట్ర వ్యవసాయ శాఖ పోర్టల్‌కు సీసీఎల్ఏ(చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి దస్త్రాలు బదిలీ కావాల్సి ఉంటుంది. జూన్ తర్వాత ఈ పోర్టల్ తెరచుకోలేదని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికే పలు దఫాలుగా రైతుబంధును కోల్పోగా వచ్చే సీజన్ నాటికైనా రైతుభరోసాను అందుకోవాలని ఆశిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో గత యాసంగి ఇదీ పరిస్థితి..

జిల్లా	లబ్ధిదారులు	ఎకరాలు	నిధులు(రూ.కోట్లలో)
మహబూబ్‌నగర్	1,90935	4,44,853	222.40
నాగర్‌కర్నూల్	2,68,363	7,30.311	365.14
వనపర్తి	1,52,513	3,58,848	179.42
జోగులాంబ గద్వాల	1,51,963	4,47,427	223.69
నారాయణ పేట	1,55,511	4,47,252	223.62

స్థానిక సంస్థల పరిశీలన



ఇటిక్యాల: విద్యార్థులతో శిక్షణలో ఉన్న సివిల్ సర్వెంట్లు, ఇతరులు

ఇటిక్యాల, మల్దకల్, ఉండవల్లి, మానవపాడు, ధరూరు, న్యూస్‌టుడే: సివిల్ సర్వీసెస్ శిక్షణ అభ్యర్థులు మంగళవారం కోదండాపురంలో స్థానిక సంస్థలను పరిశీలించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, నర్సరీలు, గ్రామ పంచాయతీ కార్యాలయం, ఉపాధి హామీ పనులు తదితర అంశాలను ఒక్కొక్కటిగా క్షుణంగా పరిశీలిస్తూ వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ● మల్దకల్ మండలం పెద్దతండాలో ఐదుగురు ఐఏఎస్ శిక్షణ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. పాఠశాలలో తరగతి గదుల్లోని విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. ● ఉండవల్లి మండలం బస్వాపురం గ్రామంలో శిక్షణ అధికారులు ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కాలనీలు, నివాసగృహాలు, జలభాండాగారాలను పరిశీలించారు. ●మానవపాడు మండలంలోని కలుకుంట్ల గ్రామంలో శిక్షణ అధికారులు స్థానిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. ● ధరూరు మండలం ఉప్పేరు ఉన్నత పాఠశాలను శిక్షణ అధికారులు సందర్శించారు. విద్యార్థులతో కలిసి మాట్లాడారు.

పరిహారం.. స్వాహాపర్వం

గద్వాల పట్టణ ఠాణాలో కేసు నమోదు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాజెక్టులకు సంబంధించి ముంపు పరిహారం రెండోసారి పొందేందుకు న్యాయస్థానంలో పని చేసే ఓ అధికారి చేతివాటం ప్రదర్శించి అడ్డంగా దొరికిపోయాడు. మోసాన్ని నేరుగా న్యాయమూర్తి గుర్తించడంతో పలు మోసాలు వెలుగు చూశాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. జిల్లాలోని పలు ప్రాజెక్టులకు సంబంధించి ముంపు భూమి బాధితులు పరిహారం పొందారు. పరిహారం న్యాయస్థానం ద్వారా బాధితులు తీసుకున్నారు. బాధితులు తీసుకున్న పరిహారం తాలూకా న్యాయస్థానం రిజిస్టర్లలో రికార్డు అయి ఉన్నాయి. అయితే బాధితుల పేరిట గుట్టుచప్పుడు కాకుండా రెండోసారి పరిహారం పొందేందుకు(డబుల్ క్లయిమ్) న్యాయస్థానంలో పని చేసే ఓ అధికారి కొందరి సహకారంతో స్కెచ్ వేశాడు. అందులో భాగంగా ఇది వరకే పరిహారం పొందిన వారి పేరిట ఉన్న వివరాలను వైట్నర్ ద్వారా సరి చేసి వేరే వ్యక్తి పేరిట రెండో సారి పరిహారం పొందేందుకు ప్రయత్నించాడు. ఇలా పలు విడతల్లో సుమారు 2016 నుంచి 2021 వరకు అధికారికంగా రూ.3.08 కోట్లు తన పేరిట, తన భార్య పేరిట డిపాజిట్ చేశారు. అయితే ఈ వ్యవహారం రూ.4 కోట్లకు పైగా ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు.. ప్రాజెక్టుల నిర్మాణంలో ముంపునకు గురయ్యే భూములను కోల్పోయిన బాధితుల రికార్డులను న్యాయమూర్తి పరిశీలించే క్రమంలో రూ. 52,45,850 విలువ చెక్కు 2021లో ఓ మహిళకు జారీచేయగా, అదే మొత్తంలో పరిహారం పొందిన ఓ వ్యక్తి పేరుపై వైట్నర్(ట్యాంపర్డ్) చేసినట్టు గుర్తించి అక్రమాలు చోటు చేసుకున్నట్లు నిర్ధరణకు వచ్చారు. ఈ క్రమంలో రికార్డులను, కంప్యూటర్ డాటాను లోతుగా విచారించడంతో సదరు అధికారి పలు విడతల్లో అక్రమాలకు పాల్పడినట్టు కనుగొని షోకాజ్ నోటీసు జారీ చేశారు. విషయాన్ని హైకోర్టు దృష్టికి న్యాయమూర్తి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశానుసారం రెండు రోజులుగా ఉన్నత స్థాయి అధికారులు లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం. న్యాయస్థాన సీనియర్ పర్యవేక్షకురాలు ఫిర్యాదు మేరకు సోమవారం గద్వాల పట్టణ ఠాణాలో అక్రమాలకు పాల్పడిన అధికారి, అతడి భార్యపై కేసు నమోదైనట్టు గద్వాల డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నామని, ముంపు పరిహారం రెండోసారి పొందేందుకు ప్రయత్నించిన ఘటనపై గద్వాల సీఐ టంగుటూరి శ్రీను విచారణాధికారిగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు.

ప్రస్తుతానికి గుర్తించిన రెండోసారి పరిహారం జమ వివరాలు


తేది	నగదు (రూ.)
23.12.2016	3,35,000
18.02.2017	8,68,227
29.04.2017	8,22,180
23.11.2017	21,66,026
16.03.2018	33,03,117
20.05.2019	69,47,120
17.12.2019	85,46,420
09.04.2021	52,45,850
16.08.2021	25,98,250

తపాలా.. పడిలేచిన కెరటంలా

వినియోగదారుల ఆకర్షణకు కొత్త పథకాలు

న్యూస్‌టుడే, పెద్దకొత్తపల్లి, తెలకపల్లి: పడిలేచిన కెరటంలా తపాలా శాఖ కొత్తపుంతలు తొక్కుతూ, నూతన పథకాల అమలుతో పునరుజ్జీవం పొందుతోంది. ఒకప్పుడు తపాలా అంటే కేవలం ఉత్తరాలు బట్వాడాకే పరిమితం. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కొత్త పథకాలతో ప్రజల్లోకి వెళ్తూ ఆదరణ పొందుతోంది. దేశంలోని ఏ ప్రాంతానికైనా పార్సిళ్లు పంపే సౌకర్యం నేడు ఖండాంతరానికి వ్యాపింపజేసింది. కొన్ని ప్రైవేట్ ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. కమ్యూనికేషన్ విభాగంలో ప్రైవేటు కొరియర్ సంస్థలు హవా నడుస్తున్న తరుణంలో తపాలా శాఖ మూసధోరణికి స్వస్తి పలికింది. పేదలు, మధ్యతరగతి ప్రజలకు పొదుపు పథకాలతోపాటు, ఇతర సేవలు అందిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తోంది. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా తపాలా వారోత్సవాలు జరుపుతూ ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా అధికారి సృజన్ నాయక్ తెలిపారు. మేళాలు నిర్వహించి కుంటుంబానికంతటికీ ఉపయోగపడే కొత్తపథకాలను ఈనెల 7 నుంచి వారం పాటు పరిచయం చేసినట్లు పేర్కొన్నారు.

జవసత్వాలు.. : 170ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న తపాలా శాఖ పడిలేచిన కెరటంలా నూతనోత్తేజంతో ముందుకు సాగుతోంది. ప్రైవేటు ఈ-కామర్స్ సంస్థలతో పోటీపడుతూనే బ్యాంకు సేవలు కూడా అందించేందుకు తపాలా బ్యాంకుగా అవతరించి సేవలు అందిస్తోంది.





బిజినేపల్లి మండలం మహదేవునిపేటలో బాధితులకు రూ.15లక్షల చెక్కు అందిస్తున్న తపాలా అధికారులు

డాక్ నిర్యత్ కేంద్ర..

ఇప్పటివరకు కేవలం దేశంలోనే పార్సిళ్లు పంపే సౌకర్యం ఉండేది. గతేడాది నుంచి డాక్ నిర్యత్ కేంద్ర్ అనే నూతన పథకంతో తపాలా శాఖ విదేశాలకు వినియోగదారులు తమ ఇళ్ల వద్ద నుంచే పార్సిల్ పంపే అవకాశం కల్పించింది. తపాలా కార్యాలయంలో ఆధార్, పాన్‌తో పేరు నమోదు చేసుకుంటే సదరు వినియోగదారుకు ప్రత్యేక నంబరు కేటాయిస్తారు. ఇండియా పోస్ట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఇంటి నుంచే పార్సిళ్లు బుక్ చేసే అవకాశం ఉంటుంది. తపాలా సిబ్బంది ఆయా అడ్రస్‌కు చేరుకుని పార్సిళ్లు తీసుకెళ్లడం, డెలివరీ చేయడం చేస్తారు. తక్కువ వ్యవధిలో, తక్కువ రుసుముతో ఈ సౌకర్యం ఏర్పాటుచేయడంతో జిల్లాకేంద్రాల్లోని ప్రధాన తపాలా కార్యాలయాలకు ఆదాయం పెరిగింది. ఉమ్మడి జిల్లాకేంద్రాల్లోని ప్రధాన తపాలా కార్యాలయాల్లో నిత్యం ఈ పథకం ద్వారా విదేశాలకు పార్సిళ్ల పంపకం పెరగడంతో దాదాపు వేల రూపాయల ఆదాయం సమకూరుతోంది.

ఈ కామర్స్‌తో ఒప్పందం..

ప్రస్తుతం ఈ కామర్స్ సంస్థలు శరవేగంగా తమ సర్వీసులు అందిస్తున్నాయి. వీటిని అందిపుచ్చుకుంటూనే పోస్టల్‌శాఖ వాటితో జతకట్టి దేశవ్యాప్తంగా పార్సిల్ సేవలు అందిస్తోంది. దాదాపు ప్రతి గ్రామీణ ప్రాంతాలలో పోస్టల్ సేవలు ఉండటంతో ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ సంస్థ పోస్టల్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో అమెజాన్‌లో బుక్‌చేసే పార్సిల్లు పోస్టుసిబ్బంది బట్వాడా చేయనున్నారు. దీంతో పోస్టల్‌కు అధనపు ఆదాయం సమకూరనుంది. ఈ కామర్స్ ఒప్పందంతో తపాలా ద్వారా నాణ్యమైన, మన్నికైన సేవలు అందిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా తపాలా అధికారి సృజన్‌నాయక్ వివరించారు



గ్రామీణ ప్రాంతాల్లోనూ 73 రకాల సేవలు..



కామన్ సర్వీస్ సెంటర్ మాదిరిగా తపాలా కార్యాలయాలు కూడా పనిచేస్తున్నాయి. 73రకాల సేవలు గ్రామీణప్రాంతాలలో అందిస్తున్నాయి. కరెంటు బిల్లులు, బస్, ట్రైన్ బుకింగ్, పాస్‌పోర్ట్ సేవలు (వనపర్తి, మహబూబ్‌నగర్‌లలో) అందిస్తున్నారు. పోస్ట్ సేవింగ్‌బ్యాంకు ఖాతాలతో తపాలాబ్యాంకు ఖాతాలను అనుసంధానం చేస్తుండటంతో బ్యాంకు లావాదేవీలు చరవాణీలలోనే చేసుకునే వెసులుబాటు ఉంటోంది. సేవింగ్ ఖాతాలకు ఎటిఎం కార్డు సౌకర్యం కూడా తపాలా శాఖ కల్పించింది. జిల్లాకేంద్రాలలో తపాలా కార్యాలయాల వద్ద ఎటిఎం కేంద్రాలను కూడా ఏర్పాటుచేసింది. దీంతో తపాలా శాఖకు నిత్యం రూ.వేల ఆదాయం సమకూరుతోంది.

బ్యాంకు సేవలతో...

తపాలా కార్యాలయాలు కేవలం ఉత్తరాల బట్వాడా, పొదుపుఖాతాలకే పరిమితం కాకుండా బ్యాంకు సేవలు అందించేందుకు ఏడేళ్ల క్రితం ఇండియా పోస్ట్ పేమెంటు బ్యాంకు గా సేవలు మొదలు పెట్టింది. వీటి ద్వారా ఆధార్ ఎనబుల్ సిస్టంతో లబ్ధిదారుల ఇండ్లవద్దే వారి బ్యాంకు లావాదేవీలు , చెల్లింపులు చేస్తోంది. ప్రమాదబీమా, ఇతర బీమా పథకాలు అందిస్తోంది. తపాలా బ్యాంకు ఏర్పాటుతో రుణాల మంజూరుకు కూడా శ్రీకారం చుడుతోంది. ఇతర బ్యాంకులు ఏమేమి సేవలు అందిస్తాయో, వాటికి ధీటుగా గ్రామాలలో తపాలా బ్యాంకు సేవలు అందించేందుకు తపాలా శాఖ నడుంబిగించింది. దీంతో తపాలా శాఖ ఆర్థికపరిపుష్టితో పుంజుకునేందుకు ప్రయత్నిస్తోంది.

ఆదరణ బాగుంది..



చిన్నమొత్తాల పొదుపుఖాతాలతో పాటు తపాలా జీవితబీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా, రికరింగ్ డిపాజిట్లు, సేవింగ్ ఖాతాలు, ఈ-సేవ, సుకన్య సమృద్ధి యోజన పేరిట ఆడపిల్లలకు పొదుపు పథకాలు ఆదరణ పొందాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి చెల్లింపులు, ఆసరా పింఛన్లు బయోమెట్రిక్ ద్వారా చెల్లిస్తున్నాం.. అటల్ పింఛన్ యోజన, సీనియర్ సిటిజన్ పథకం, ప్రధాన మంత్రి జీవన బీమా, మంత్లీ ఇన్ కమ్ పథకం, తదితర పథకాలున్నాయి. ఏడాది వ్యవధిగల ప్రమాదబీమా పథకంలో రూ.599 ప్రీమియం చెల్లించి రూ. 10 లక్షల పరిహారం పథకం, రూ.799 చెల్లిస్తే రూ.15లక్షలు పరిహారం అందనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 12 బాధిత కుటుంబాలకు పరిహారం ఇచ్చాం.

- భూమన్న, వనపర్తి డివిజన్ పర్యవేక్షకులు

చేనేత సహకార సంఘం పనితీరు భేష్

అమరచింత, న్యూస్‌టుడే: అమరచింత చేనేత ఉత్పత్తిదారుల సహకార సంఘం పనితీరు స్ఫూర్తిదాయకంగా ఉందని వివిధ రాష్ట్రాల నాబార్డ్ అధికారులు కొనియాడారు. పట్టణ శివారులోని సహకారం సంఘాన్ని మంగళవారం కర్ణాటక, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి నాబార్డ్ ఆధ్వర్యంలో 50 మంది సభ్యులు సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నాబార్డ్, డీసీసీబీ బ్యాంకు అధికారుల చేయూతతో అమరచింత పట్టణంలోని చేనేత కార్మికులు సంఘం ఎలా ఏర్పాటు చేసుకున్నారో అమరచింత సహకార సంఘం సీఈవో చంద్రశేఖర్ వారికి వివరించారు. చేనేత కార్మికుడు ఒక యజమాని వద్ద చేనేత పని చేయకుండా స్వయంగా ఇక్కడ మగ్గం ఏర్పాటు చేసుకుని సంఘం ద్వారా విక్రయించడం, వచ్చిన లాభాన్ని ప్రతి ఏడాది తీసుకోవడం జరిగిందన్నారు. ఇంట్లో మగ్గం ఏర్పాటుకు స్థలం లేనివారు కూడా ఇక్కడ నేత పనిలో ఉన్నట్లు చెప్పారు. సంఘం ద్వారా జరిగే ప్రతి ఖర్చు, జమ అంతర్జాలంలో నమోదు చేయడంతో పాటు ప్రభుత్వానికి నాబార్డు ద్వారా తెలియజేస్తునట్లు వివరించారు. డీసీసీబీ బ్యాంకుల ద్వారా కార్మికులకు రుణాలు ఇప్పించి వారికి వచ్చే గౌరవ వేతనంలో అప్పు చెల్లించే విధంగా చేశామన్నారు. కర్ణాటక డీజీఎం సతీష్ కర్త, బీఐఆర్‌డీ డీజీఎం యోగేష్, నాబార్డు అధికారి షణ్ముకం చారి, డీసీసీబీ ఆత్మకూరు మేనేజర్ నబీ, సభ్యులు పాల్గొన్నారు.



మగ్గంపై నేస్తున్న చీరను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

24న బీచుపల్లిలో సీతారాముల కల్యాణం

ఇటిక్యాల, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో ఈ నెల 24న సీతారాముల కల్యాణం ఏర్పాటు చేసినట్లు కోదండ రామాలయ మేనేజర్ సురేందర్ రాజు తెలిపారు. స్వామి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని కోదండరామాలయంలో కల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ మేనేజర్ సూచించారు.

చదువు రాకపోయినా ఆంగ్లంలో చేవ్రాలు!

సిబ్బంది పేరిట దొంగ సంతకాలతో నిధులు స్వాహా

వారంతా కిందిస్థాయి సిబ్బంది.. చెప్పిన పని చేసి వెళ్లడం తప్పా.. ఏనాడు ఇదేంటని ప్రశ్నించలేని అమాయకత్వం.. ఎన్నికల సందర్భంగా వారి పేరిట ప్రోత్సాహక నిధులు విడుదలయ్యాయి. వారికి తెలియకుండా అధికారులే దిగమింగారు. కనీస చదువు రాని వారు ఆంగ్లంలో సంతకం చేసిన డాక్యుమెంట్ బయటపడటంతో అవినీతి వెలుగులోకి వచ్చింది. అప్రమత్తమైన సదరు అక్రమార్కులు సిబ్బందిని పిలిచి తలా కొంత ఇస్తాం తీసుకోండి అంటే ఆత్మాభిమానంతో 'మాకొద్దంటూ..' వెళ్లడం కొసమెరుపు.

- న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో పార్లమెంటరీ ఎన్నికల సమయంలో పనిచేసిన కార్మికులకు డబ్బులు ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా తప్పుడు సంతకాలు పెట్టుకొని నిధులు డ్రా చేసుకున్నారు. దీనిపై కలెక్టరేట్‌లో గుసగుసలు మొదలయ్యాయి. ఎంపీ ఎన్నికల సమయంలో నిధుల విషయంలో పక్కదారి పట్టించారనే విమర్శలున్నాయి. కలెక్టరేట్‌లో స్వీపర్లు, సెక్యూరిటీ సిబ్బంది, గార్డెన్‌లో పనిచేసే సిబ్బంది మొత్తం 20 మంది వరకు ఎంపీ ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించారు. కాని ఎవ్వరికి డబ్బులు ఇవ్వలేదు. ఒక్కరికి మాత్రమే రూ.18 వేలు చెల్లించారు. మిగతా వారికి డబ్బులు ఇవ్వకపోగా 13 మందికి రూ.18వేల చొప్పున డబ్బులు చెల్లించినట్లుగా దొంగ సంతకాలు పెట్టి నిధులు డ్రా చేసుకున్నారు. గార్డెన్‌లో పని చేసే వారికి చదువు రాదు కానీ రెవెన్యూ స్టాంప్‌పై ఆంగ్లంలో సంతకాలు పెట్టుకోవడం చర్చనీయాంశమైంది. అన్ని ఒక్కరే సంతకాలు పెట్టినట్లుగా సమాచారం. ఈ విషయం బయటికి రావడంతో ఇటీవల కలెక్టరేట్‌లో ఉండే అధికారులు పనిచేసిన వారిని పిలిచి రూ.2వేలు, రూ.5వేలు చొప్పున ఇస్తామని చెప్పడంతో తమకు ఈ డబ్బులు వద్దంటూ వెళ్లిపోయారు. జిల్లాలో ఎన్నికల విధుల చెల్లింపుల్లో అవకతవకలపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపడతారోనని ఉత్కంఠ నెలకొంది.



రెవెన్యూ స్టాంప్‌లపై తప్పుడు సంతకాలు పెట్టినట్లుగా బయటికి వచ్చిన పత్రాలు





ఇదీ అంగన్వాడీ దుస్థితి

అంగన్వాడీ కేంద్రాలు ఎలాంటి వసతి సమస్యలు ఎదుర్కొంటున్నాయో ఈ చిత్రాలను చూస్తే తెలుస్తుంది. ఊట్కూరు మండలం పులిమామాడిలో సరైన భవనాలు లేక నాలుగు అంగన్వాడీ కేంద్రాలను ఒకే భవనంలో కొనసాగిస్తున్నారు. ఒక్కొక్క కేంద్రంలో దాదాపుగా 18 మంది పిల్లలు ఉన్నారు. ప్రస్తుత భవనంలో ఒక గది, వరండా మాత్రమే ఉన్నాయి. గదిలో నాలుగు కేంద్రాల సామగ్రి ఉంచడానికే చాలడం లేదు. వరండాలో 72 మంది పిల్లలను కూర్చోబెట్టి నాలుగు వైపులా నలుగురు టీచర్లు పర్యవేక్షిస్తుండటాన్ని చిత్రంలో చూడొచ్చు.

- న్యూస్‌టుడే, నారాయణపేట

నేటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి గురుకుల క్రీడలు

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు మంగళవారం కల్వకుర్తికి చేరుకున్నారు. గురుకుల సొసైటీ పరిధిలోని మొత్తం 16 పాఠశాలల నుంచి సుమారు 540 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ నాగమణి, వ్యాయామోపాధ్యాయురాలు సింధు తెలిపారు.

కోయనగర్ సమాఖ్య ఆర్పీ శ్రీలతపై కేసు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : స్వయం సహాయక సంఘాల డబ్బులను పక్కదారి పట్టించిన రిసోర్స్ పర్సన్(ఆర్పీ)పై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామీణా ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం,.. మహబూబ్‌నగర్ పట్టణం వేంకటేశ్వర కాలనీకి చెందిన శ్రీలత మెప్మాలో ఆర్పీగా పనిచేస్తున్నారు. 2017 మార్చి నుంచి ఆమె కోయనగర్ మహిళా సమాఖ్య ఆర్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. 30 స్వయం సహాయక సంఘాలకు చెందిన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, పొదుపు డబ్బులు రూ.1,49,36,205 పక్కదారి పట్టినట్లు విచారణ తేలిందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీశైలంలో 2 గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది. ప్రాజెక్టు 2 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 55,508 క్యూసెక్కులు.. కుడి, ఎడమ విద్యుత్తు కేంద్రాల ద్వారా 66,331 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు జలాశయం నీటి మట్టం 884.30 అడుగులుగా (211.4759 టీఎంసీలు) ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూరాల జలాశయం నుంచి 62,158 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 31,858 క్యూసెక్కుల వరద నీళ్లు శ్రీశైలంలోకి చేరుతోంది.



గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ పోటీల్లో రజతం



రజతం సాధించిన జట్టుతో సంఘం సభ్యులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: వరంగల్‌లో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు రజతం వరించింది. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేత జట్టును అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ సంఘం కార్యదర్శి సాదిఖ్‌అలి, ఉపాధ్యక్షుడు శరత్‌చంద్ర, కోశాధికారి ఆనంద్, సభ్యులు రాఘవేందర్, నాగరాజు, మేరిపుష్ప, శిక్షకులు కపిల్ వర్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఉన్నతాధికారి వేధింపులు తాళలేక ఈవో వినోద మంగళవారం నిద్ర మాత్రలు వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గుర్తించి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ప్రసుత్తం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలాలా ఉన్నాయి.. 2022 నవంబరులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా వినోద ఎంపికయ్యారు. పెబ్బేరులో విధుల్లో చేరాల్సి ఉండగా అప్పటి డీడబ్ల్యూవో పుష్పలత కార్యాలయ అవసరాల నిమిత్తం ఆమెను డిప్యూటేషన్‌పై జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఈవోగా తీసుకున్నారు. ఇటీవల ఇన్‌ఛార్జి డీడబ్ల్యూవోగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మమ్మ.. వినోదను పెబ్బేరు వెళ్లాలని ఒత్తిడి చేశారు. వ్యక్తిగత కారణాల నేపథ్యంలో కొంత సమయం కావాలని తర్వాత వెళ్తానని చెప్పినా వినకుండా లక్ష్మమ్మ సోమవారం ఇక్కడి నుంచి రిలీవ్ కావాలని అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. లక్ష్మమ్మ, మరో అధికారి వేధింపులతో మనస్తాపం చెంది నిద్ర మాత్రలు వేసుకున్నట్లు బాధితురాలు తెలిపారు. ఈ విషయమై లక్ష్మమ్మను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సూపర్‌వైజర్ల కొరత వల్ల ఆమె స్థానానికి వెళ్లాలని సూచించామన్నారు. అంగన్‌వాడీ సెంటర్లపై పర్యవేక్షణ ఉండాలని అందుకోసం తప్పకుండా వెళ్లాలని సోమవారం ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. బాధితురాలు తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలన్నారు.

వసతిగృహంలో బీటెక్ విద్యార్థి బలవన్మరణం

మేడ్చల్, న్యూస్‌టుడే: వసతి గృహంలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన సిద్ధార్థయాదవ్ (19) మేడ్చల్ పట్టణం ఉమానగర్‌లోని వీఐపీ వసతి గృహంలో ఉంటున్నాడు. కిస్టాపూర్‌లోని మల్లారెడ్డి కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల అనంతరం సోమవారం వసతిగృహానికి వచ్చాడు. మంగళవారం తోటి విద్యార్థులంతా కళాశాలకు వెళ్లారు. సిద్ధార్థయాదవ్ కళాశాలకు వెళ్లలేదు. సాయంత్రం తన గది లోపల నుంచి గడి పెట్టి ఉంది. తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఫోన్‌లో పలు ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు ఉండటంతో పోలీసులు ఆ కోణంలో విచారణ చేస్తున్నారు.

లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం: ఒకరి దుర్మరణం

కృష్ణా, న్యూస్‌టుడే : వాసూనగర్ ఆర్టీవో చెక్‌పోస్టు ఎదురుగా ఆగి ఉన్న లారీని బైకుతో ఢీకొని మాగనూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మంగలి శేఖర్(36) మృతి చెందాడు. మంగళవారం కొత్తపల్లి నుంచి కర్ణాటకలోని దేవసూగూరుకు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ శేఖర్‌ను దేవసూగూర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. శేఖర్‌కు భార్య, పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణా ఏఎస్ఐ కతలప్ప తెలిపారు.



శేఖర్

అప్పు వివాదం... పరస్పరం కేసులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: అప్పు విషయంలో చోటుచేసుకున్న వివాదంతో యువతి, యువకుడు పరస్పరం ఠాణాలో ఫిర్యాదు చేసుకున్న ఘటన ఇది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తికి చెందిన రవీందర్‌నాయక్‌కి కొన్నాళ్ల క్రితం తన సోదరి ద్వారా గుంటూరుకు చెందిన శ్రావణి పరిచయం అయ్యింది. శ్రావణి అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటుంది. ఇద్దరి పరిచయం స్నేహంగా మారింది. శ్రావణి తండ్రి అనారోగ్యంతో ఉండటంతో రవీందర్‌నాయక్ నుంచి రూ.6 లక్షలు అప్పు తీసుకుంది. రవీందర్ డబ్బుల కోసం ఫోన్ చేయగా దాటవస్తూ వస్తోంది. ఈనెల 20న రాత్రి 9గంటల ప్రాంతంలో యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్కులో ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగింది. కోపంతో శ్రావణి, రవీందర్‌నాయక్‌ను చెంపదెబ్బకొట్టింది. తర్వాత ఫోన్ చేయగా రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు యువకులు దేవరాజ్, తేజ, కార్తీకేయ, ఇదాయత్ రవీందర్ నాయక్‌ను చితక్కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అప్పు తీసుకున్నందుకు తనను పెళ్లిచేసుకోవాలని వేధింపులకు గురిచేయడంతో పార్కుకు పిలిపించి, స్నేహితుల ముందు అవమాన పరిచాడని, దాడిచేసి గాయపరిచాడని రవీందర్‌నాయక్‌పై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసులు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.



చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00



మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

గద్వాల గ్రామీణం : 9052211532 | అలంపూర్ : 8008573916
అయిజ : 8008573922 | అలంపూర్ పట్టణం : 8008573930



సమస్య: రాజోలి పునరావాస గృహాల వద్ద ఏర్పాటు చేసిన సోలార్ దీపాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. సుమారు 200కి పైగా పనిచేయడం లేదు. ఒక వైపు ఒరిగిపోయి కూలుతున్నాయి. స్తంభాలు, బ్యాటరీలు దొంగల పాలవుతున్నాయి. **- లక్ష్మణ్, రాజోలి**

సమాధానం : ఉమ్మడి జిల్లా సమయంలో 14 ఏళ్ల కిందట వాటిని ఏర్పాటు చేశారు. నిర్వహణ ఎవరు చూడాలనే వివరాలు లేవు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **- ఖాజామొహినుద్దీన్, ఎంపీడీవో**

- న్యూస్‌టుడే, రాజోలి

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి



పాఠశాల విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: పట్టుదలతో పాటు ఏకాగ్రతపై దృష్టి పెట్టి తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని గద్వాలలోని శ్రీసరస్వతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మాకం బీమపల్లి విద్యార్థులకు సూచించారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలలో 'ఈనాడు ప్రతిభా పాటవ' పోటీల్లో భాగంగా ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీలో పాఠశాల విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పాఠశాల స్థాయి నుంచే పోటీతత్వాన్ని అలవాటు చేసుకుంటే ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు మెండుగా ఉంటాయని కరస్పాండెంట్ పేర్కొన్నారు. మొదటి స్థానంలో శ్రీనవ్య, రెండో స్థానంలో చంద్రిక, మూడో స్థానంలో అక్షితలు నిలిచారు. విజేతలకు కరస్పాండెంట్ బీమపల్లి, డైరెక్టర్ మాకం అనురాధ, ప్రిన్సిపల్ వెంకటయ్యగౌడ్‌లు బహుమతులు అందజేసి అభినందించారు. పాఠశాల ఇన్‌ఛార్జి కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భారత్‌మాల.. పనికొస్తోందిలా!

భారత్‌మాల రోడ్డుపైన మొక్కజొన్నలు ఆరబెట్టుకుంటున్న రైతులను చిత్రంలో చూడొచ్చు. పనులు చేయించే సిబ్బంది అభ్యంతరాలు పెడుతున్నా, ఖాళీగా ఉంది కదా పంటలు ఆరబెట్టుకుంటున్నాం.. లేదంటే మమ్మల్ని రానిస్తారా అంటున్నారు రైతులు. రోడ్డు పనులకు మా భూములు ఇచ్చి ఇప్పుడు కల్లాలు లేక ఇబ్బంది పడాల్సి వస్తోందంటున్నారు. హైవే రోడ్డు పనులతో పాటు సర్వీస్ రోడ్డు పనులు పూర్తిచేసి ఉంటే మాకు ఇబ్బంది ఉండేది కాదని అంటున్నారు. సర్వీస్ రహదారి పనులు త్వరగా పూర్తిచేయించాలని రైతులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, శాంతినగర్

తెరపై ఈనాడు

గద్వాల : ఎస్వీసీ సినిమాస్... **దేవర, విశ్వం, జనక అయితే గనక.** **అయిజ:** శివసాయి : **దేవర** భువనేశ్వర్ : **విశ్వం.** మాధవ్ : **వేట్టయన్**

- న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

నేటి నుంచి భాగవత సప్తాహం

మల్దకల్, న్యూస్‌టుడే: మల్దకల్ మండలం అమరవాయిలోని రామాంజనేయ, వీరభద్రస్వామి ఆలయాల ఆవరణలో బుధవారం నుంచి భాగవత సప్తాహ పారాయణం ఉంటుందని వికాసతరంగిణి సభ్యులు తెలిపారు. శ్రీరామానుజ చిన్నజీయర్ స్వామి ఆదేశాలతో 29వ తేదీ వరకు ఏడు రోజుల పాటు విశ్వహిందూ పరిషత్తు, చినజీయర్‌స్వామి శిష్య బృందంతో ఈ కార్యక్రమం ఉంటుందని భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

కేటీదొడ్డి ఏవోగా సాజిదా

ధరూరు, న్యూస్‌టుడే: కేటీదొడ్డి మండల వ్యవసాయ అధికారిగా సాజిదా రహమాన్ బాధ్యతలు తీసుకున్నారు. కేటీదొడ్డి ఏవోగా పనిచేస్తున్న మహాలక్ష్మిని గద్వాలకు బదిలీ చేయటంతో ఆమె స్థానంలో సాజిదా వ్యవసాయ అధికారిగా వచ్చారు.

కూల్చివేతను అడ్డుకున్న యజమానులు



ఓవైపు కూల్చిన భవనం

ఉండవల్లి, న్యూస్‌టుడే: పుల్లూరు గ్రామ శివారులోని టోల్‌ప్లాజా వద్ద కట్టిన భవనాన్ని కలెక్టర్ ఆదేశాలు, హైకోర్టు ఉత్తర్వుల మేరకు కూల్చివేతకు వెళ్లిన అధికారులను భవన యజమానులు మంగళవారం అడ్డుకున్నారు. ఉండవల్లి తహసీల్దార్ హరికృష్ణ భవనం కూల్చివేతకు అక్కడికి చేరుకున్నారు. భవనంలో కొనసాగుతున్న తినుబండారాలు, టీ దుకాణ (టీ బ్రేక్) నిర్వాహకులు భవన యజమానులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడి చేరుకుని కూల్చివేతను అడ్డుకున్నారు. అప్పటికే భవనానికి ఒకవైపు రేకులతో వేసిన నిర్మాణాన్ని తొలగించారు. భవనం ఉన్న స్థలం జాతీయ రహదారి (ఎన్‌హెచ్ఏఐ) సంస్థకు చెందినదని కోర్టు ఉత్తర్వుల మేరకు కూల్చివేస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. భూమిని మరోసారి సర్వే చేయించాలని, అక్రమ కట్టడమైతే తామే స్వయంగా కూల్చివేస్తామని యజమానులు తెలియజేయడంతో తహసీల్దార్ ఉన్నతాధికారులకు సమాచారం కూల్చివేతను తాత్కాలికంగా నిలిపివేశారు. అలంపూర్ సీఐ రవిబాబు, ఉండవల్లి, అలంపూర్ ఎస్సైలు మహేష్, వెంకటస్వామి, పోలీసులు భద్రతను పర్యవేక్షించారు. జాతీయ రహదారి అధికారి వరుణ్ తదితరులున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



తాటికుంట సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కౌన్సిలర్ సురేష్

మల్దకల్, న్యూస్‌టుడే: రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లల కోసం బాలరక్షభవన్ ఏర్పాటు చేశామని ఇది వారి హక్కుగా భావించి కార్యాలయం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహిళాశిశు సంక్షేమశాఖ బాలల పరిరక్షణ విభాగం జిల్లా కౌన్సిలర్ సురేష్ సూచించారు. మంగళవారం తాటికుంట జిల్లా పరిషత్తు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. బాలల వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి వివరించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని అలాంటివి జరుగుతుంటే 100, 1098కి చరవాణి ద్వారా సమాచారం అందజేయాలన్నారు. యువత మత్తుపదార్థాలు, చెడు వ్యసనాలకు లోనవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాలంటీర్ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయుడు కృష్ణ, అంగన్వాడీటీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



గోడపత్రికలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, తదితరులు

గోడపత్రికల ఆవిష్కరణ

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: కేటీదొడ్డి మండలంలోని పాగుంట లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను గోడపత్రికలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. నవంబరు 1న కల్యాణ మహోత్సవం, 2న రథోత్సవం, 3వ తేదీన స్వామి వారికి పల్లకిసేవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈవో పురందర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ● ఈ నెల 26న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6వరకు గద్వాలలోని వ్యవసాయ మార్కెట్‌లో జరగనున్న గద్వాల రైతు సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, నాయకులు జంబు రామన్‌గౌడ, గడ్డం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నిండు ప్రాణాన్ని నిలిపే రక్తదానం



సిబ్బందికి పండ్లు, అందిస్తున్న డీజీ సిద్దిఖీ

ఇటిక్యాల, న్యూస్‌టుడే: రక్తదానం ఓ నిండు ప్రాణాన్ని నిలుపుతుందని టీజీ ఎస్పీ డీజీ ఎంఎస్ సిద్దిఖీ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఎర్రవల్లిచౌరస్తాలోని పదో పటాలంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 22 మంది పటాలం సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం డీజీ పండ్లు అందించారు. కమాండెంట్ సాంబయ్య, అదనపు కమాండెంట్ సుబ్రహ్మణ్యం, చౌహాన్, రాజారావు, ఆర్.ఐ.సింగ్, గోపాల్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'దేశ అభివృద్ధి భాజపాతోనే సాధ్యం'



మల్దకల్‌లో భాజపా సభ్యత్వాల జిల్లా ప్రభారి బాల్‌రెడ్డి

మల్దకల్, న్యూస్‌టుడే: దేశాభివృద్ధి భాజపాతోనే సాధ్యమని పార్టీ జిల్లా ప్రభారి బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మల్దకల్ మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా హాజరై మాట్లాడారు. ప్రతి బూత్‌లో వందకు పైగా సభ్యత్వాలు నమోదు చేయించాలని సూచించారు. జిల్లా ప్రధానకార్యదర్శి డీకే. స్నిగ్ధారెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ రామాంజనేయులు, మండల అధ్యక్షుడు పాలవాయి రాముడు, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, బల్గెర శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



వీక్షిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

మల్దకల్, న్యూస్‌టుడే: పత్తి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశముందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం మండలంలోని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మల్దకల్ రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు సీహెచ్ దామోదర్‌రాజు, మల్లారెడ్డి పత్తిసాగుపై ప్రగతిశీల ఖర్చుల గురించి వివరించారు. పత్తిలో ముఖ్యమైన నిర్వహణ పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొదలైన అంశాల గురించి సైంటిస్ట్ జి.లీలమ్మ అవగాహన కల్పించారు. మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, పెసలు సాగుపై శాస్త్రవేత్తలు రైతులతో ముఖాముఖి చర్చించారు. ఏవో రాజశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారులు కిషోర్‌కుమార్, హారిక, భాస్కర్, ఖాజాబాషా, మేమున పాల్గొన్నారు.

ఆశాలకు దినచర్య కార్డుల పంపిణీ

మానవపాడు, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తలు తమ విధులను సమర్థంగా నిర్వహించాలని



కార్డు అందజేస్తున్న ఆశా నోడల్ అధికారిణి అక్కమ్మ

నోడల్ అధికారిణి అక్కమ్మ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలకు దినచర్య కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు తమ దినచర్యకు సంబంధించిన వివరాలను కార్డులో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు.

నిబంధనల ప్రకారం విక్రయాలు ఉండాల్సిందే

ధరూరు, న్యూస్‌టుడే: రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల విక్రయాలు నిబంధనల ప్రకారం ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ అన్నారు. మంగళవారం ఆయన గట్టు మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి దుకాణం ముందు ధరల పట్టికలు ఉండాలన్నారు. ఈపాస్ యంత్రంలో నమోదు ఉన్న ఎరువుల నిల్వను పరిశీలించారు. అంతకు ముందు గోర్లఖాన్‌దొడ్డి గ్రామంలో రైతువేదికలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్డీఎస్ కాల్వలు

చివరి ఆయకట్టుకు చేరని నీరు




జూలేకల్ శివారు కాలువ ఇలా..

వడ్డేపల్లి, న్యూస్‌టుడే : ఆర్డీఎస్ కాలువలు నిర్మించి దశాబ్దాలు పూర్తి కాగా పిల్ల కాలువలు రూపురేఖలు కోల్పోయి సాగునీటికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి నిర్వహణ సరిగా లేకపోవడంతో అధ్వానంగా మారాయి. పిచ్చిమొక్కలు, ముళ్లకంప చెట్లతో కీకారణ్యాన్ని తలపిస్తున్నాయి. నీటి పారకంలో అవరోధాలు ఎదురవుతున్నాయి. ఆర్డీఎస్, తుమ్మిళ్ల ఎత్తిపోతల నీళ్లు వచ్చినా పంట పొలాల వరకు చేర్చుకోవడానికి వీలు లేని అధ్వాన పరిస్థితి ఉంది. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

● సబ్ డిస్ట్రిబ్యూటరీలోనూ పూడిక, చెత్తాచెదారం పేరుకుపోయింది. అక్కడ కాల్వలో చెట్లు పెరిగాయి. వీటితో పాటు ఎక్కడ చూసినా డ్రాప్‌లు, యూటీలు దెబ్బతిన్నాయి. తూములు అసలే పని చేయడం లేదు. ఫలితంగా ఏటా ఎగువ ప్రాంతంలోని రైతులకే తప్ప శివారుకు పూర్తిస్థాయిలో నీరందడం లేదు. నీటి పారుదల లేని సమయంలో కాల్వల నిర్వహణపై అధికారులు దృష్టి సారించకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు అంటున్నారు.

● 1964లో డి1 నుంచి డి12 వరకు కర్ణాటక పరిధి కాగా 84,500 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో రాష్ట్రంలో డి12ఎ నుంచి డి40 అలంపూర్ మండల శివారు గ్రామాల వరకు కాలువలు నిర్మించారు. అయితే నదిలో పుష్కలంగా నీరున్నా పూర్తి స్థాయి ఆయకట్టు ఏనాడూ సాగుకాలేదు. ప్రస్తుతం 12ఎ నుంచి డి40 లోపు డి22 వరకు ఆర్డీఎస్ నీరు, డి23 నుంచి డి30 వరకు తుమ్మిళ్ల లిఫ్టు నీరు, డి31 నుంచి డి40 వరకు జూరాల లింక్ నీరు అందజేస్తున్నారు.



డి26 కాలువలో పెరిగిన మొక్కలు

● ఆర్డీఎస్ ప్రధాన కాలువ సైతం శిథిలావస్థలోనే ఉంది. లైనింగ్ పూర్తిగా దెబ్బతింది. కొన్ని చోట్ల గట్ల వెంట, కాలువ అంచుల్లోనే లైనింగ్ పోయినచోట ముళ్ల కంప చెట్లు నీటి పారుదలకు అడ్డంగా పెరిగినా పట్టించుకునే వారే లేరు. రామాపురం, మానవపాడు, అలంపూర్ శివారులో కాలువల్లో ముళ్ల కంప చెట్ల చెత్త ఉందని రైతులు వివరిస్తున్నారు.



కాలువలు బాగుచేస్తేనే..: ఆర్డీఎస్ ప్రధాన కాలువలో నీటి పారుదల సక్రమంగా ఉంటేనే రైతులకు మేలు జరుగుతుంది. కాలువల్లో ముళ్ల కంప పెరిగి నీరు అందడం కష్టం ఉంటుంది. వాటిని తొలగించి కట్టలు సరిచేసి సామర్థ్యం మేర నీటిని విడుదల చేస్తేనే పంటలు తడుపుకోవడానికి వీలుంటుంది.

- నర్సింహులు, రైతు, వెంకట్రామనగర్



ఎదురుచూపులు తప్పట్లేదు: కాలువల్లో చెట్లు పెరిగి నీటి కోసం రైతులు పోట్లాడుకోవాల్సి వస్తోంది. కాలువల్లో తక్కువ స్థాయిలో నీరు రావడంతో అందరూ ఒకే సారి నీటి కోసం ఎదురు చూడటం వంటి వాటివల్ల సమస్య ఏర్పడుతోంది. అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి పిల్ల కాలువలు బాగు చేయాలి. **- వెంకటేశ్‌యాదవ్, రైతు, జూలేకల్**

రైతులు సహకరించాలి: ప్రధాన కాలువ బాగు పడాలంటే ఎక్కువ మొత్తంలో నిధులు అవసరమవుతాయి. సబ్ డిస్ట్రిబ్యూటరీల్లో నిధులు ఉన్న మేరకు పనులు చేయిస్తున్నాం. పిల్ల కాలువల్లో పెరిగే ముళ్ల చెట్ల తొలగింపునకు రైతుల సహకారం అవసరం. పంట పొలాల వరకు చేరే కాలువలైనందున రైతులు స్వచ్ఛందంగా శుభ్రం చేసుకుంటే ఏ ఇబ్బందీ ఉండదు.

- విజయకుమార్‌రెడ్డి, ఈఈ, ఆర్డీఎస్, జోగులాంబ గద్వాల

పోటీలను విజయవంతం చేద్దాం



మైదానాన్ని పరిశీలిస్తున్న పుర ఛైర్మన్ దేవన్న, అధికారులు

అయిజ, న్యూస్‌టుడే: ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న సీఎం కప్ క్రీడాపోటీలను విజయవంతం చేద్దామని అయిజ మున్సిపల్ ఛైర్మన్ దేవన్న పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలాధికారులతో కలిసి మైదానాన్ని పరిశీలించారు. పోటీల నిర్వహణకు కావాల్సిన వసతులు, ఇతరాత్ర మౌలిక సదుపాయాలు తదితరాలు ఏమేరకు ఉన్నాయనేది పరిశీలించారు. క్రీడాకారులకు అవసరమైన వాటిని వెంటనే సమకూర్చాలని ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో వెంకటయ్య, ఎంఈవో రాములు దయాళ్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

అలంపూర్, న్యూస్‌టుడే: విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని పారిశుద్ధ్య కార్మికులకు పుర ఛైర్‌పర్సన్ మనోరమ సూచించారు. మంగళవారం తెల్లవారుజామున పుర కార్యాలయానికి వెళ్లి పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికను ఆకస్మికంగా పరిశీలించారు. వార్డులలోని చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగిస్తూ శుభ్రంగా ఉంచాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు సమయపాలన పాటించాలన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: పండగల సందర్భంగా మహబూబ్‌నగర్ రీజియన్‌లోని ఆర్టీసీ కార్మికులు సమష్టిగా కష్టపడి భారీ ఆదాయాన్ని సమకూర్చారని ఆర్ఎం వి.శ్రీదేవి అన్నారు. ఆర్టీసీ సమావేశ మందిరంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసి మాట్లాడారు. 13 మంది ఆర్టీసీ డ్రైవర్లు, అయిదుగురు అద్దె బస్సు డ్రైవర్లు, ఏడుగురు కండక్టర్లు, మెకానిక్, ఎలక్ట్రీషియన్, శ్రామిక్ ఒక్కొక్కరికి అవార్డులు ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

రాజోలి, న్యూస్‌టుడే: వేగంగా వెళ్తున్న వాహనం అదుపు తప్పడంతో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం రాజోలి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శివకుమార్ స్థానిక పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. బస్టాండు వద్ద పని ఉండటంతో పునరావాస గృహాల నుంచి వెళ్తుండగా, ఎస్సీ కాలనీ వద్ద అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయలు కావడంతో కుటుంబ స్థానికులు గమనించి చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

దారి విషయంలో గొడవ: కేసు నమోదు

ధరూరు, గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: కేటీదొడ్డి మండలం చింతల కుంట గ్రామంలో జములమ్మ అనే మహిళ ఇంటి ముందు నుంచి తమ ఇంటికి దారి కావాలంటూ దూషించిన వారిపై కేసు నమోదైంది. ఎస్సై శ్రీనివాసుల కథనం మేరకు. . గ్రామానికి చెందిన నాగప్ప, నర్సింహులు అనే వ్యక్తులు జములమ్మ ఇంటి ముందున్న దారి తమకు కూడా హక్కుందని వాగ్వాదానికి దిగటంతో పాటు భౌతిక దాడి చేయటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్పీకి ఫిర్యాదు: ఇంటి బాట విషయమై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన తమను కేటీదొడ్డి ఎస్సై శ్రీనివాస్ దూషించాడని ఆరోపిస్తూ కేటీ దొడ్డి మండలం చింతలకుంట గ్రామానికి చెందిన నాగప్ప మంగళవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తమ ఫిర్యాదుపై విచారణ జరపకుండానే తమను బెదిరించిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

వ్యక్తికి రిమాండ్

గద్వాల అర్బన్: గత నెల గద్వాలలోని అయిజ మార్గం మేలచెర్వు చౌరస్తా సమీపంలో మద్యం తాగిన మత్తులో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన దాసరపల్లికి చెందిన నవీన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరపర్చగా కోర్టు రిమాండ్‌కు ఆదేశించినట్లు పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ చెప్పారు.

పశుసంపదతో రైతులు ఆర్థికాభివృద్ధి



శిబిరంలో గొర్రెలకు వైద్యం పరిశీలిస్తున్న జిల్లా అధికారి

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే పశుసంపద తోడు ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ, జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జూలేకల్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో పశువైద్యులు గర్భకోశ పరీక్షలు, గాలికుంటు నివారణ టీకాలు చేశారు. గద్వాల ఏరియా పశువైద్యశాల ఏడీ యూఆర్ రమేష్, వైద్యులు పుష్పలత, శంకరయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణ కేంద్రానికి వినతి: పాడి పశువుల కోసం కృత్రిమ గర్భధారణ కేంద్రం ఏర్పాటు చేయాలని జూలేకల్ రైతులు కోరారు. మంగళవారం జూలేకల్ పశువైద్య శిబిరానికి హాజరైన పశువైద్యాధికారికి రైతులు వినతిపత్రం సమర్పించారు. పాడి పశువులు ఎదకు వచ్చిన సమయంలో ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. లింగనిర్ధారణ వీర్యం అందు బాటులో ఉందని, ఆడ దూడలే పుట్టించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.

అవగాహనలేని ఆరోపణలు విడ్డూరం



మాట్లాడుతున్న రామన్‌గౌడ, చిత్రంలో విజయ్‌కుమార్ తదితరులు

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నోనిపల్లి రిజర్వాయర్‌పై కొందరు అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గద్వాల నియోజకవర్గం, చిన్నోనిపల్లి రిజర్వాయర్‌పై అవగాహన లేని వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. రిజర్వాయర్లో మొత్తం ఐదు గ్రామాలకు కలిపి 2,400 ఎకరాల పట్టా భూములకు 2006-07లోనే భూ పరిహారం వచ్చిందన్నారు. అందులో ఇంకా అసైన్మెంట్ భూమి 130 ఎకరాలు రిజర్వాయర్లో ముంపునకు గురైందన్నారు. ఇప్పటివరకు కోర్టు ద్వారా 68 ఎకరాలకు పరిహారం వచ్చిందని, 244 ఎకరాలకు అవార్డులు సిద్ధమయ్యాయని ఆరోపణలు చేయడం, ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, నాయకులు ముని, చంద్రగౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి

ఉండవల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రజాసంఘాల నాయకులు జయరాజ్, విజయ్‌కుమార్, వడ్డేపల్లి జడ్పీటీసీ మాజీసభ్యుడు కాశపోగు రాజు అన్నారు. మంగళవారం అలంపూర్‌చౌరస్తాలో వ్యవసాయ మార్కెట్‌యార్డులో ప్రజా సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. అలంపూర్ నియోజకవర్గంలో సీలింగ్, అసైన్డు, భూదాన్, ప్రభుత్వ భూముల పరిరక్షణకు కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భూకబ్జాలపై అధికారులకు ఫిర్యాదు చేశామని నాయకులు తెలిపారు. అర్హత ఉన్న నిరుపేదలకు ప్రభుత్వ భూములు అందాలనేది కమిటీ ఉద్దేశమని, అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీకాంత్, నాగరాజు, మధు, శేఖర్, మక్బుల్, ప్రసంగి, తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డులో మాట్లాడుతున్న నాయకులు

నూతన కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ సంఘం సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన రీజియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటయ్య (అచ్చంపేట), ప్రధాన కార్యదర్శిగా దార సుందర్ (కల్వకుర్తి) ఉపాధ్యక్షులుగా వెంకటయ్య, భాస్కర్, రామన్న, మహిళా కార్యదర్శిగా భాగ్య, ప్రచార కార్యదర్శిగా సురేశ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గోపాల్, ఇమ్మానియేల్, యాదయ్యను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మహబూబ్‌నగర్ పుర కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులును నియమించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ఛైర్మన్ రాజయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్, కృష్ణ హాజరయ్యారు.



నూతన కార్యవర్గంతో సంఘం సభ్యులు

'భూ వ్యవహారంపై విచారణ సిద్ధమా'

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నోనిపల్లి రిజర్వాయర్ ప్రభుత్వ భూముల వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ సిద్ధమా అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని భారాస రాష్ట్ర నాయకులు కురువ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి తాను చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లో గద్వాల ఎమ్మెల్యే, ఆయన ప్రధాన అనుచరులు చేసిన దోపిడీని అన్ని ఆధారాలతో చూపించినట్లు వెల్లడించారు. 244 ఎకరాల ప్రభుత్వ భూమిని పేద అమాయక రైతులను అడ్డు పెట్టుకుని దొంగ రికార్డులను సృష్టించారన్నారని ఆరోపించారు. గద్వాలలో బహిరంగ చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యేకు ఆయన సవాల్ విసిరారు. గద్వాల నియోజకవర్గ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని విజయ్‌కుమార్ పేర్కొన్నారు.